కథానిక

# తెగిపోయిన గులాబీ

బులుసు-జీ-ప్రకాశ్

వేసవికాలం. బ్రహ్మాండమైన ఉష్ణ రాత్రి. అవని అంతా ఉడికిపోతూంది. మైత్రేయ కూడా అదే స్థితిలో వున్నాడు. జ్వరంతోనూ, తలనొప్పితోనూ మంచంమీదపడుకొన్నాడు. సరైన విశ్రాంతిలేని కారణంవల్ల తను మంచంపై అటూ ఇటూ దొర్లుతున్నాడు, సముద్రం అటూ పోటూలాగా.

"జ్వరం ఎంతుందీ?" మైత్రేయ ప్రశ్నించాడు.

"ఇవాళ దిగిందిలెండి! కాని నిన్నమాత్రం జాస్తీ అయి నన్ను కలవరపెట్టింది."

"నిన్ననా? నిన్నకూడా నేనీ మంచంపై ఒంటరిగా ఇట్లానే పడుకొని వున్నానా?" అతని కంఠధ్వని చాలా వికృతంగా వుంది. తనేదో నిన్న ఘనకార్యం చెయ్యబోయి మరచిన విధంగా ఉన్నాడు.

"నిన్నటి రోజంతా మీకు ఒంటిపై తెలివే లేదు."

ఒక్కసారిగా మైత్రేయ ఎక్కడలేని బలమూ కూడ తీసుకొని అకస్మాత్తుగా ఒక్క గెంతు గెంతాడు. ఇందిర అతన్ని ఆపయత్నించేసరికి, అతనప్పుడే గుమ్మం దాటాడు.

"ఎక్కడికి వెళుతున్నారు?" ఆశ్చర్య సంభ్రమాలతో ఇందిర ప్రశ్నించింది.

"ఒకసారి స్నానపు గదిలోకి వెళుతున్నా!" కొంచెం తొట్రుపాటుతో జవాబు చెప్పాడు మైత్రేయ.

"పాలు కొంచెం త్రాగుదురుగా నుండండి" అంటూ ఇందిర ఇంట్లోకి వెళ్ళిపోయింది.

ఆమె తిరిగి వచ్చేసరికి మంచం ఖాళీ! స్నానపు గదిలోకెళ్ళి వెదికి చూచింది. అతనక్కడా లేడు. గది బైటకొచ్చింది. మైత్రేయ వంటింట్లోంచి పెరట్లోకి వెళ్ళారని బంట్రోతు చెప్పాడు. వంటింట్లోంచి వెళ్ళి పెరటిద్వారం వద్ద నుంచుని, మైత్రేయ ఏదో కార్యంలో నిమగ్నుడైవున్నట్టు ఇందిర గుర్తించింది. పెరట్లో కుడివైపున రెండు గదులు ఖాళీగావున్నాయ్. అవి వాళ్లు వాడుకోడం లేదు. వాటి కెదురుగానే ఒక చక్కని గులాబీ మొక్క ఉన్నది. ఆ చెట్టుపై మైత్రేయ ప్రతిరాత్రీ వంగి బాల్చీతో నీళ్లు పోస్తూంటాడు. ఈర్ష్య, ఏహ్యభావం, కలిగాయి ఈ వింత చూస్తున్న ఇందిరకి.

ఆ గులాబీ చెట్టు! ఆ చిన్న రోజా చెట్టు ఛాయ ఆమెపైపడి, ఆమెనూ, భర్తనూ విడదీయడానికి తోడ్పడుతూన్నట్లు రూపించింది.

వివాహానంతరం మైత్రేయ ఆ గులాబీ మొక్కకి నీళ్లు పొయ్యడం చూసింది. ఆమెకీ విశాల ప్రపంచంలో ఎవరైనా శత్రువేవుంటే అది ఆ గులాబీ చెట్టే!

మైత్రేయ ఎప్పుడైతే ఆఫీసునుంచి తిరిగొస్తాడో, ఇందిర అతన్ని అత్యుత్సాహంతో ఆహ్వానిస్తూ ఆనంద గీతికలు పాడేది. అతనికి ఒక వంద తేనె కబుర్లు చెప్ప యత్నించేది. ఎంతో చక్కగా అలంకరించుకుని మైత్రేయని సంతృప్తిపరచడానికి అమితంగా కృషి చేసేది.

కాని మైత్రేయ?...

ఆమె నొక్కసారైనా కన్నెత్తి చూడడు. ఏదో ముఖ్యమైన వస్తువు పారేసుకుని వెదకబోయే వాడిలా గులాబీచెటు దగ్గరకి పోతాడు. ప్రతిరోజూ రాత్రివేళ దానికి నీళ్లు పోస్తాడు. ఎండి రాలిన ఆకుల్ని పైని పారేస్తూంటాడు. ముందు గులాబీచెటు పని పూర్తయేక మిగిలిన పనులు చేసేవాడు.

ఎన్ని పర్యాయాలో ఇందిర అంది:

"బంట్రోతు నీళ్లు పొయ్యడా? తోటమాలీ ఎందుకున్నట్టు?"

చిరునవ్వుతో మైత్రేయ అనేవాడు "కాదు. దానికి నీరు నేనే స్వయంగా పోయాలి" ధోరణి మార్చేసి భుజంమీద చెయ్యేసి "రా! కాఫీ త్రాగివద్దాం!" అనేవాడు. ఇందిర మాట్లాడేది

కాదు.

ఇందిర ఆమె భర్తను వెంబడించి అడిగింది, "ఏం చేస్తున్నారు?"

"నీళ్లు పోస్తున్నా" అతనన్నాడు, "నిన్నటి నుంచీ దీనికి నీళ్లు పొయ్యనేలేదు."

"మీకేం పిచ్చి పట్టిందా ఏమిటి? అంత జ్వరంతోనా? రండి. వచ్చేయండి."

"ఉండు మరి..."

"తోటమాలీ చేస్తాడు"

"వద్దు!"

"నేను పోస్తా! మీరు రండి. లెండి" తొందర పెట్టింది.

"ఆగు!" చేతులూపుతూ ఎన్నో బాల్చీల నీరు మైత్రేయ ఆమె ముందుగా పోశాడు.

* * *

మైత్రేయ రాకకై ఎదురు చూస్తూ ఇందిర గేటువద్ద నించుంది. మైత్రేయ కొన్నిదినాలై ఊళ్ళోలేడు. ఆమె అతనికోసం కారు పంపి, ఆమె గేటువద్ద నిలబడ్డది, చిరునవ్వుతో ఆహ్వానిద్దామని.

కారులోంచి దిగాడు మైత్రేయ. ఆమె వైపుకే అసలతను చూడలేదు. అలవాటు ప్రకారం పెరట్లోకి వెళ్ళాడు. గులాబీ చెట్టెలాగుందో! వెనకాలే ఇందిర కూడా వెళ్ళింది. మైత్రేయ నిలుచుండి పోయాడు! ఏం చెప్మా గులాబీచెట్టులేదు? ఎవరో అది లాగి పారేశారు.

ఆక్కడ వొట్టి గొయ్యి. చెట్టుతాలూకు బద్దుమాత్రం వున్నాయ్. కిటికీలోంచి ఇందిర చూస్తోంది.

మైత్రేయ కొయ్యబారిపోయి పిచ్చివాడిలా చాలాసేపటి వరకూ నిలబడి పోయాడు. చివరికి కదలిక పుట్టి హఠాత్తుగా గెంతువేసి గదిలోకొచ్చి వాలాడు. మైత్రేయ కళ్ళను చూస్తూంటే ఇందిర కళ్లు బెదురుతున్నాయ్. కొన్ని ఘడియలు పోయాక ఆమె అతని గది తలుపులు త్రోసింది. భయం! అనుమానం! ఆత్రుత! ఆమె గదిలో ప్రవేశించగానే గదిఖాళీ!

* * *

"ఇందిరా! నీ క్రౌర్యంతో ఆ ఒక్క గులాబీ చెట్టు త్రెంపేశావ్! నా మధుర స్మృతుల్ని జ్ఞప్తికి తెచ్చే ఆ ఒక్క చెట్టూ ఉండడం నీవు సహించుకోలేక పోయావ్. నా ప్రస్తుత స్థితి, భవిష్యత్తును చూసి నువ్వు సంతృప్తి చెందలేక పోయావ్. నా కడచిన దినాలపైనే వ్రాలావు.

నేను కాలేజీలో చదువుతూన్నప్పుడు నాకొక ముసిల్ది నా యింటి ప్రక్కనే లభించింది. ఆమె వితంతువు. మా శాఖ స్త్రీయే!

నేనామెను మొదట్లో ఎరగను. కాని ఒక రోజాక కూరలవాడు ఆమెతో బాకీకోసం దెబ్బలాడుతున్నాడు. వాడామెను మందలిస్తూ వుంటే ఆమె ఏడుస్తూంది. అది చూచి నేను ఓర్చుకోలేక పోయాను. డబ్బు పారేసి తక్షణమే పొమ్మన్నాను. అతనాశ్చర్యపోయి ఆ డబ్బు పట్టుకుని వెళ్ళిపోయాడు. నేనామెవద్ద ఆట్టేసేపు ఉండలేక పోయాను, కాలేజీకి పోతున్న కారణంవల్ల. కాలేజీనుంచి నేను తిరిగొస్తుంటే ఆమె నన్నభినందిస్తూ కంట నీరుపెట్టుకుంది. నేనామెకు దేవుణ్ణని చెప్పింది. ఆమెకు భరించరాని జబ్బుమూలంగా పనిలోకి వెళ్ళలేకపోయేది. ఆమెకి ఓ కూతురుండేది. ఆమె పడుచుపిల్ల కావడంవల్ల ముసల్ది ఆమెని పనిలోకి పంపేదికాదు. ముదుసలి చరిత్ర విని ఆమెకు కొన్ని రూపాయిలిచ్చాను.

ఒకనాటి ప్రొద్దుట, గదిలో కూర్చుని వుండగా, వరండాపై ఒకమ్మాయి నించుని వుండడం చూసి ఆశ్చర్యపోయాను. చాలా అందగత్తె. కళ్ళవెంట నీళ్లు కారుతున్నాయ్. పైకొచ్చి ఎందు కేడుస్తున్నావని అడిగాను. "అమ్మ మిమ్మల్ని పిలవమని పంపించింది. చాలా జబ్బుగా వుంది." క్షణంలో ఆమె ముసిల్దాని కుమార్తె అని గ్రహించాను. ఆమెను తీసుకుని వాళ్ళింటికెళ్ళాను. ముసిల్ది చిన్న మంచంపై పడుక్కుని వుంది.

"బాబూ! నేను చనిపోతున్నా. కాని అమ్మాయినెక్కడ విడిచిపెట్టాలో తెలీదు. ఆమెకు దిక్కెవరూ లేరు, అందగత్తె. ప్రక్కింటి విద్యార్థులు ఆమెను చూస్తున్నారు, నే చనిపోతే ఆమె జీవితాన్ని వాళ్లు నరకం చేస్తారు. నువ్వీ పిల్లని అధమం పనికత్తెగానైనా స్వీకరించు. మీ అమ్మా, నాన్నా కూడా ఈమె పనులవల్ల సంతృప్తి చెందగలరు" అంది. అమ్మాయి ఏడుస్తోంది. "ఈ అమ్మాయి మీ

జాతిదే! కాని నిన్ను పెళ్ళి చేసుకునే అదృష్టం ఆమెకు లేదు. అంచేత దాసీగా వుంచుకో! ఆమె నీకూ, నీ మాతాపితలకూ, నీ సోదరికీ కూడా సహాయం చేయగలదు" ముసల్ది చెప్పింది.

ఇద్దర్నీ చూడగానే నా హృదయం కరుణతో నిండింది. అమ్మాయివైపు చూశాను. ఆమె అందంగా వుంది. ఆమెను దాసీగా స్వీకరించడానికి నా యౌవనరక్తం అంగీకరించలేదు.

"ఎందుకమ్మా!" నేనన్నాను—"నీకూతుర్ని నేను పెళ్ళి చేసుకుంటాను. నాకు భార్య కాగల అవకాశం ఆమెకుంది. ఒక్క గంట ఆగు. నేనిప్పుడే వస్తాను" అంటూ నేనవతలికెళ్లిపోయాను. తల్లీ పిల్లలిద్దరూ నావైపు ఆశ్చర్యంతో చూశారు. నేనొక బ్రాహ్మణుడి దగ్గరకెళ్ళి నాకు పెళ్లి చేయమని కోరుతూ అతన్ని రమ్మన్నాను. "ఏమో! నీ మాటలపై నాకు నమ్మకం లేదు, నేరాను!" అతను నిరాకరించాడు. "నీకు నేను వందకాదు రెండొందలిస్తాను. నాతో రా!" అని అరచాను, అతనేమీ బోధపర్చుకో లేదుగాని, నన్ను అనుసరించాడు. మేమిద్దరం మార్కెట్‌కెళ్లి ఎర్రంచుల చీర ఒకటి, కొన్ని నారికేళాలు, ఇంకా మరికొన్ని అవసర పదార్థాలూ కొన్నాం.

మేము ముసలిదానింటికి చేరేసరికి ఆమె తెలివితప్పిపోయి పడుంది. ప్రక్కన అమ్మాయి ఏడుస్తోంది. "అమ్మా! చూడు నీ కూతురికి పెళ్ళవుతూంది" అంటూ మొహంమీద కొన్ని నీళ్లు జల్లగా ఆమె తెలివి తెచ్చుకుంది. మా యిద్దరిమధ్యా బ్రాహ్మణుడుమంత్రాలు చదవగా పెళ్లి పూర్తికాగా, వృద్ధురాలు మరణించింది.

మా నాన్నకీవిషయం తెలిసి- "నా యింట్లోంచి కదులు! వ్యభిచారిణ్ణి పెళ్లిచేసుకుని కుటుంబ నాశనం చేశావ్!" అన్నాడు. "నాన్నా! ఆమెతల్లి చాలా మర్యాదస్తురాలు వారట్లాంటివారు కారు!" అన్నాను. "నీ మాటలు నేనిక వినదలచుకోలేదు ఫో!" అని కసిరాడు.

నేను గదిలో కెళ్లాను. మీరారాణి ఏడుస్తోంది. ఆమె వెళ్ళిపోతానంది. "మనిద్దరమూ కలిసే పోదాం" అని పైకి వచ్చేశాం. నేను చిన్న యిల్లు అద్దెకు పుచ్చుకుని మీరాతో జీవిస్తున్నాను. అవన్నీ నా జీవితంలో సంతోషదాయకమైన దినాలు! ఇక్కడ చిన్న గదులు రెండే వుండేవి. అవిప్పుడా గులాబీచెట్టు ప్రక్కనే వుండడంనువ్వు చూస్తూనేవున్నావు. నాచదువు చాలించి ఉద్యోగ ప్రయత్నానికెళ్ళాను. కాని ఒక్కటీ లాభించలేదు. మా పెరట్లో కొన్ని మంచి పూల చెట్లుండేవి. ఆ పూవులు మీరా కోసి దండలుగా గ్రుచ్చేది. మా యింటిప్రక్క నొకావిడ అవి బజార్లో అమ్మి బియ్యం కొని తెచ్చేది. సాయంత్రం నేను అలసి వచ్చేసరికి మీరా రాణి చక్కని నవ్వును చవిచూసేవాణ్ణి. ఆమె, నేను మొదట్లో చెప్పినకంటే ఎక్కువ అందంగా వుండేది. చాలా కులాసాగా వుండేవాళ్ళం. మళ్ళీ చూస్తే బీదవాళ్లం. పెళ్ళిలో కొన్న ఆ ఎర్ర చీరె తప్పించి మీరాకు మరో చీర లేదు. ఒక్కనాడైనా క్రొత్తది కొనమని నాతో అనలేదు.

నేనొక సాయంత్రం యింటికొచ్చేసరికి ఆ గులాబీ చెట్టును చూశాను. "నువ్వు తోటపని అంతా చేసేస్తున్నావే!" అన్నా.

"ఔను! గులాబీ, పూలల్ని ఎక్కువ అందంగా చేస్తుంది. దీనిద్వారా మనం ఎక్కువ డబ్బు సంపాయించుకోవచ్చు. ఉద్యోగయత్నం మీరు చేయవద్దు!" ఆమె అంది.

మరి కొన్ని మాసాలకి మీరాకి జబ్బు చేసింది. నేను డాక్టర్లనెవ్వర్నీ పిలువలేకపోయాను. కాని చేయాల్సిందంతా చేశాను. పదోరోజున ఆమె చనిపోయింది.

నేనారాత్రి యింటికి తిరిగొచ్చేసరికి, గులాబీ చెట్టులోంచి ఒక చిన్న మొగ్గ లేచి నవ్వుతూండడం చూశాను. మీరా చావలేదని, ఆ చెట్టు మొగ్గలో కూర్చుని నన్ను పలకరిస్తున్నట్లు తోచింది.

ఇందిరా! నీతో నేను గడిపిన జీవితం అబద్ధం! నాకు సత్యమైనది ఆ గులాబీచెట్టు, కాని ఇప్పుడు నువ్వా సత్యాన్ని చెడిపి, ప్రపంచంలో అసత్యాన్ని నిలిపావు.

అని ఇందిర టేబుల్‌పై వున్న ఉత్తరాన్ని తీసి చదివింది. ఆమెకళ్లు నీళ్ళతోనిండి కిటికీలోంచి గులాబీచెట్టుండే స్థలంవైపు చూశాయి.

గులాబీ చెట్టెక్కడిదీ?